




జాతీయ తెలుగు దినపత్రిక

RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు








| శనివారం 06 జూన్ 2026 | పేజీలు : 04 | వెల - రూ 2/- | సంపుటి : 02 సంచిక : 004 | ప్రచురణ : తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : శెట్టి వెంకటేష్ |
|---|---|---|---|---|---|


## ప్రపంచానికి సుస్థిర భవిష్యత్ దిశగా భారత్ అడుగులు



సందేశం టైమ్స్, న్యూఢిల్లీ, జూన్ 6, ప్రతినిధి: 'ఒకే భూమి – ఒకే కుటుంబం – ఒకే భవిష్యత్' అనే సిద్ధాంతంతో భారత్ పరిశుభ్రమైన, పచ్చదనంతో కూడిన, సుస్థిర ప్రపంచ నిర్మాణం కోసం మిషన్ లైఫ్ స్ఫూర్తితో ముందుకు సాగుతోందని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. పర్యావరణ పరిరక్షణ, ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదల, అభివృద్ధి లక్ష్యాల సాధనలో కేంద్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో దేశ జీడీపీ వృద్ధిరేటు 7.7 శాతం, నాలుగో త్రైమాసికంలో 7.8 శాతంగా నమోదవడం దేశ ఆర్థిక వ్యవస్థ బలాన్ని ప్రతిబింబిస్తోందని పేర్కొన్నారు. 140 కోట్ల భారతీయుల కృషి, కేంద్ర ప్రభుత్వ సంస్కరణల ఫలితంగానే ఈ ప్రగతి సాధ్యమైందన్నారు. ప్రజల జీవన సౌలభ్యం, వ్యాపార అనుకూల వాతావరణం, యువతకు ఉపాధి అవకాశాల పెంపు కోసం ప్రభుత్వం మరింత కృషి చేస్తుందని వెల్లడించారు. ఇదే సమయంలో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో దమన్‌లో నూతన 'నమో ఆసుపత్రి'ను ప్రారంభించినట్లు తెలిపారు. ఆధునిక సౌకర్యాలతో ఏర్పాటైన ఈ ఆసుపత్రి దమన్, డీయూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించనుందని చెప్పారు. దమన్ పర్యటన సందర్భంగా ప్రజలు అందించిన విశేష స్వాగతానికి కృతజ్ఞతలు తెలిపిన ప్రధాని, దమన్ అండ్ డీయూ అభివృద్ధికి ఎన్డీయే ప్రభుత్వం పెద్దఎత్తున నిధులు కేటాయించి పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టులు ప్రజల జీవన ప్రమాణాలను మరింత మెరుగుపరిచాయని తెలిపారు.



## దమన్‌లో ఘన స్వాగతం.. అభివృద్ధికి కేంద్రం కట్టుబాటు: ప్రధాని మోదీ



సందేశం టైమ్స్, దమన్, జూన్ 6, ప్రతినిధి: దమన్ పర్యటన సందర్భంగా ప్రజలు అందించిన ప్రత్యేక స్వాగతానికి తాను గౌరవంగా భావిస్తున్నానని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. దమన్ అండ్ డీయూ అభివృద్ధి కోసం ఎన్డీయే ప్రభుత్వం భారీ స్థాయిలో నిధులు కేటాయించి పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందన్నారు. మౌలిక సదుపాయాల విస్తరణ, వైద్య సేవలు, విద్యా రంగ అభివృద్ధి, పర్యాటక రంగ ప్రోత్సాహం వంటి అనేక ప్రాజెక్టులు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచాయని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం, ప్రాంతీయ అభివృద్ధి లక్ష్యంగా నిరంతరం పనిచేస్తోందని ప్రధాని స్పష్టం చేశారు.



## పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి: సీఎం రేవంత్ రెడ్డి




సందేశం టైమ్స్, హైదరాబాద్, జూన్ 6, ప్రతినిధి: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రకృతి, పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేస్తున్న ప్రతి ఒక్కరికీ ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ప్రకృతి మనకు జీవనాధారం మాత్రమే కాకుండా భవిష్యత్తుకు మార్గదర్శకమని పేర్కొన్న సీఎం, వాతావరణ మార్పుల వల్ల ఎదురవుతున్న సవాళ్లను అధిగమించేందుకు ప్రతి వ్యక్తి తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. ఒక మొక్క నాటడం, నీటిని ఆదా చేయడం, కాలుష్యాన్ని తగ్గించడం వంటి చిన్నచిన్న చర్యల ద్వారానే రాబోయే తరాలకు స్వచ్ఛమైన, సురక్షితమైన భూమిని అందించగలమన్నారు. కాలుష్య ఉద్గారాలను తగ్గించేందుకు విద్యుత్ వాహనాల వినియోగం, గ్రీన్ ఎనర్జీ ప్రోత్సాహం, సౌర విద్యుత్ ఉత్పత్తి విస్తరణ, అర్బన్ పార్కుల అభివృద్ధి, చెరువుల పునరుద్ధరణ వంటి చర్యలను ప్రజా ప్రభుత్వం చేపడుతోందని తెలిపారు. హైదరాబాద్ నగరాన్ని నెట్-జీరో సిటీగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

## పాలమూరు ప్రాజెక్టుల పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన సీఎం రేవంత్ రెడ్డి



సందేశం టైమ్స్, మహబూబ్‌నగర్, జూన్ 6, ప్రతినిధి: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరుసగా రెండోరోజు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ప్రధాన తాగునీటి, నీటిపారుదల ప్రాజెక్టుల పనులను క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పరిశీలించారు. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం కింద కొనసాగుతున్న పనుల పురోగతిని తెలుసుకుంటూ వివిధ ప్రాంతాల్లో సుడిగాలి పర్యటన నిర్వహించారు. సోమశిల అతిథిగృహం నుంచి బయలుదేరిన సీఎం ముందుగా కొల్లాపూర్ మండలంలోని ఎల్లూరు పంప్ హౌస్‌ను సందర్శించి పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలోని ప్యాకేజీ-3 హెడ్ రెగ్యులేటర్, ప్యాకేజీ-2 నార్లాపూర్ రిజర్వాయర్, ప్యాకేజీ-1 డెలివరీ సిస్టర్న్, కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలోని లిఫ్ట్-1 పంప్ హౌస్‌ల పనులను పరిశీలించారు. అనంతరం పీఆర్ఎల్ఐఎస్ టన్నెల్‌లో 1.5 కిలోమీటర్ల మేర ప్రయాణించి పంప్ హౌస్ పనుల పురోగతిపై అధికారులను ప్రశ్నించారు. బిజినేపల్లి మండలం కుమ్మెర వద్ద స్టేజ్-3 పంప్ హౌస్, వట్టెం రిజర్వాయర్‌కు సంబంధించిన ప్యాకేజీ-9, 10, 11 పనులను పరిశీలించారు. అనంతరం హెలికాప్టర్ ద్వారా భూత్పూర్ మండలం కొత్తూరు చేరుకుని కరివేన రిజర్వాయర్‌కు సంబంధించిన ప్యాకేజీ-14, 15 పనులను పరిశీలించగా, జడ్చర్ల మండలం ఉద్దండాపూర్‌లో ప్యాకేజీ-17, 18 పనులను కూడా సమీక్షించారు. పర్యటన సందర్భంగా ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్లను పరిశీలిస్తూ ప్రాజెక్టుల పురోగతిపై అధికారులను వివిధ వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కరివేన రిజర్వాయర్ వద్ద మీడియాతో మాట్లాడిన సీఎం పాలమూరు ప్రాంత సాగు, తాగునీటి అవసరాల కోసం ప్రభుత్వం ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయడంపై దృష్టి సారించిందన్నారు. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ప్రజాప్రతినిధులు, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు ముఖ్యమంత్రి వెంట పాల్గొన్నారు.




## పాలమూరు ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తాం: సీఎం రేవంత్ రెడ్డి

సందేశం టైమ్స్, మహబూబ్‌నగర్, జూన్ 6, ప్రతినిధి: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో కొనసాగుతున్న సాగు, తాగునీటి ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి జిల్లాకు నీటి సౌభాగ్యం తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. జిల్లాలోని 26 లక్షల ఎకరాలకు సాగునీరు అందించి పాలమూరును సస్యశ్యామలం చేయడానికి చిత్తశుద్ధితో పనిచేస్తామని వెల్లడించారు. గత రెండు రోజులుగా పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం సహా పలు నీటిపారుదల ప్రాజెక్టులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన అనంతరం కొత్తూరు కరివెన రిజర్వాయర్ వద్ద మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరితో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో సీఎం మాట్లాడారు. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా జిల్లాకు 90 టీఎంసీల నీటిని అందించే అవకాశం ఉన్నప్పటికీ గత ప్రభుత్వం ప్రాజెక్టును పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. భూసేకరణ పూర్తి చేయకుండా పంపులు, లిఫ్ట్‌లకే వేల కోట్ల రూపాయలు ఖర్చు చేశారని ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో సాగునీటి ప్రాజెక్టుల పేరిట రూ.84,503 కోట్ల అప్పు చేయగా, తమ ప్రభుత్వం గత 30 నెలల్లో అసలు, వడ్డీ కలిపి రూ.52,121 కోట్లు చెల్లించిందని తెలిపారు. అదనంగా కొత్త ప్రాజెక్టుల కోసం రూ.22 వేల కోట్లు ఖర్చు చేయగా అందులో రూ.8 వేల కోట్లు ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రాజెక్టులకే కేటాయించామని చెప్పారు. ఇంకా 4 వేల ఎకరాల భూసేకరణ అవసరముందని, రైతులు కోరుతున్న ధర కంటే ఎక్కువైనా చెల్లించి భూసేకరణ పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. రాబోయే రెండేళ్లలో ప్రాజెక్టుల పనులను గరిష్ట స్థాయిలో పూర్తి చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని, 2027 నాటికి పంపులు, లిఫ్ట్‌లు, కాలువల పనులను పూర్తి చేయాలని భావిస్తున్నామని పేర్కొన్నారు. జిల్లాలో నీటిని నిల్వ చేసేందుకు అవసరమైన రిజర్వాయర్ల పనులను కూడా పునరుద్ధరిస్తామని తెలిపారు. కర్నాటక సరిహద్దులో బ్రిడ్జ్ కమ్ బ్యారేజ్ నిర్మాణంపై సాంకేతిక నిపుణులతో చర్చించి కర్నాటక ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటామని వెల్లడించారు. జిల్లాలో అభివృద్ధి విషయంలో రాజకీయాలకు అతీతంగా అందరూ ఒక్కటిగా ఉండాలని సీఎం పిలుపునిచ్చారు. పాలమూరు ప్రాజెక్టుల పనులు పూర్తి చేయడంలో తమ చిత్తశుద్ధిని ఎవరూ శంకించాల్సిన అవసరం లేదని, తాను ఈ ప్రాంతానికి చెందిన వ్యక్తినని, మరింత బాధ్యతాయుతంగా పనిచేస్తానని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తోందని, కేంద్రం కేవలం మద్దతు ధర ప్రకటించి కొనుగోలు బాధ్యత నుంచి తప్పుకోవడం సరికాదని విమర్శించారు. రాష్ట్ర రైతులకు అవసరమైన యూరియాను కేటాయించాలని, రామగుండం ఫెర్టిలైజర్స్‌లో ఉత్పత్తి అవుతున్న యూరియాను రాష్ట్ర అవసరాలకు వినియోగించాలని కేంద్రాన్ని కోరారు. గోదావరి జలాల్లో తెలంగాణకు కేటాయించిన 968 టీఎంసీల నికర జలాల విషయంలో చుక్క నీటినైనా వదులుకునే ప్రసక్తే లేదని సీఎం స్పష్టం చేశారు. కృష్ణా జలాలపై ఉన్న సమస్యలను వచ్చే డిసెంబర్ నాటికి పరిష్కరిస్తామని, అవసరమైతే చివరి నిమిషం వరకు పోరాడతామని పేర్కొన్నారు. తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టు నిర్మాణంపై మహారాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదింపులు కొనసాగుతున్నాయని, ఈ అంశంపై మహారాష్ట్ర ముఖ్యమంత్రికి లేఖ కూడా రాసినట్లు తెలిపారు.




## మెదక్ అర్బన్ ఫారెస్ట్ పార్కులను టూరిస్ట్ హబ్‌లుగా అభివృద్ధి చేస్తాం: కలెక్టర్ ప్రతిమా సింగ్

సందేశం టైమ్స్, మెదక్, జూన్ 6, ప్రతినిధి: మెదక్ జిల్లాలోని అర్బన్ ఫారెస్ట్ పార్కుల గొప్పతనాన్ని పర్యాటకులకు విస్తృతంగా ప్రాచుర్యం కల్పించి వాటిని టూరిస్ట్ హబ్‌లుగా అభివృద్ధి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా రామాయంపేట మండలం అక్కన్నపేట గ్రామంలోని వన్ యోజన అటవీ పార్కులో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని 200 మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ రత్నాకర్ జోహారీ, డీఎఫ్‌వో జోజి, డీఆర్‌డీఓ పీడీ శ్రీనివాసరావు, ఆర్ అండ్ బీ ఈఈ వేణు, రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లాలో అటవీ వారోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. 'ఏక్ పెడ్ మా కే నామ్' కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్కరూ తమ తల్లి పేరుతో ఒక మొక్క నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. మొక్కలు మానవాళి మనుగడకు జీవనాధారమని, భావితరాలకు పచ్చని భూమిని అందించేందుకు ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలన్నారు. జిల్లాలో 24 శాతం అటవీ సంపద ఉందని, నర్సాపూర్, వడియారం, పరికిబండ, మనోహరాబాద్ అర్బన్ ఫారెస్ట్ పార్కులను ప్రత్యేకంగా అభివృద్ధి చేసి పర్యాటకులకు ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. విద్యార్థులకు ప్రత్యేక ఫారెస్ట్ టూర్లు ఏర్పాటు చేసి అడవుల ప్రాముఖ్యత, జీవ వైవిధ్యం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తామని వెల్లడించారు. జిల్లాస్థాయి గ్రీన్ యాక్షన్ ప్లాన్ ద్వారా అటవీ సంపద పరిరక్షణతో పాటు ఫారెస్ట్ పార్కులకు మరింత ప్రాచుర్యం కల్పించే చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. అనంతరం ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ రత్నాకర్ జోహారీ మాట్లాడుతూ చెట్లు మానవాళి మనుగడకు ప్రతిరూపాలని, ప్రకృతి విపత్తుల సమయంలో చెట్ల ప్రాముఖ్యత ఎంతో ఉంటుందని వివరించారు. గ్రామీణాభివృద్ధి శాఖ, అటవీ శాఖ సమన్వయంతో పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలను మరింత బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు.

## ఐదు నెలలుగా సర్పంచ్‌లకు గౌరవ వేతనాలు బకాయి

సందేశం టైమ్స్, హైదరాబాద్, జూన్ 6, ప్రతినిధి: రాష్ట్రంలో కొత్తగా ఎన్నికైన గ్రామ సర్పంచ్‌లకు గత ఐదు నెలలుగా గౌరవ వేతనాలు అందకపోవడంతో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. 2025 డిసెంబర్‌లో మూడు దశల్లో జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల అనంతరం డిసెంబర్ 22న నూతన సర్పంచ్‌లు బాధ్యతలు చేపట్టినప్పటికీ ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా గౌరవ వేతనం చెల్లించలేదని సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి సర్పంచ్‌కు నెలకు రూ.6,500 చొప్పున చెల్లించాల్సి ఉండగా ఐదు నెలలకు ఒక్కొక్కరికీ రూ.32,500 బకాయి పడింది. రాష్ట్రంలోని 12,762 గ్రామపంచాయతీలకు కలిపి సుమారు రూ.41.28 కోట్ల మేర బకాయిలు పేరుకుపోయినట్లు సమాచారం. గ్రామాల్లో పర్యటనలు, ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే ఖర్చులకు ఈ గౌరవ వేతనం ఉపయోగపడుతుందని భావించినా ఇప్పటి వరకు చెల్లింపులు జరగకపోవడం నిరాశ కలిగిస్తోందని సర్పంచ్‌లు వాపోతున్నారు. సర్పంచ్‌లతో పాటు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండే వార్డు సభ్యులకు ఇవ్వాల్సిన సిట్టింగ్ ఫీజులు కూడా పెండింగ్‌లోనే ఉన్నట్లు తెలుస్తోంది. ఈ విషయమై పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులను సంప్రదించగా గౌరవ వేతనాల చెల్లింపుకు సంబంధించిన ఫైల్ ప్రస్తుతం సర్క్యులేషన్‌లో ఉందని పేర్కొంటున్నారు. పెండింగ్‌లో ఉన్న గౌరవ వేతనాలను వెంటనే విడుదల చేసి గ్రామపంచాయతీలకు నేరుగా నిధులు కేటాయించాలని రాష్ట్ర సర్పంచ్‌ల సంఘాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాయి.



## అల్లాదుర్గం మండలంలో సబ్సిడీపై జీలుగు విత్తనాల పంపిణీ

సందేశం టైమ్స్, అందోల్ టౌన్, జూన్ 5, ప్రతినిధి: ఆందోల్ నియోజకవర్గంలోని అల్లాదుర్గం మండలంలో రైతులకు సబ్సిడీపై జీలుగు విత్తనాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాల మేరకు వట్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల లక్ష్మి శేషారెడ్డి ఆధ్వర్యంలో, మండల వ్యవసాయ అధికారి రాజేష్ అధ్యక్షతన అల్లాదుర్గం మండలంలోని ఐబీ చౌరస్తా సమీపంలోని జగదంబ ఫర్టిలైజర్స్ వద్ద రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అల్లాదుర్గం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొప్పుల శేషారెడ్డి, చిల్వార్ సర్పంచ్ శశిరెడ్డి, డీసీసీ జిల్లా కార్యదర్శి అంజా గౌడ్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ జైపాల్, ఏఈఓ విట్టల్ రావు, నవీన్ కుమార్‌తో పాటు ప్రభు, రమేష్, అంబాదాస్, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## వేగంగా ధాన్యం కొనుగోలు జరగాలి.. జనగణన పక్కాగా నిర్వహించాలి: కలెక్టర్ ప్రతిమా సింగ్



సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, జూన్ 6, ప్రతినిధి: జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను అత్యంత వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. నర్సింగ్ మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రంతో పాటు జనగణన ప్రక్రియను డీఎంసీఎస్, డీఎస్ఓ, ఆర్డీఓ, తహసీల్దార్, జనగణన అధికారులతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు పూర్తయిన కేంద్రాల్లో ఉన్న సిబ్బంది, వాహనాలు, వస్తు సామాగ్రి, హమాలీలను ధాన్యం నిల్వలు ఇంకా ఉన్న కేంద్రాలకు తరలించి కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. మిల్లుల్లో ధాన్యం అన్లోడింగ్ పనులు కూడా త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. అలాగే జనగణన ప్రక్రియను పక్కాగా నిర్వహించి ప్రజల వివరాలను ఖచ్చితంగా నమోదు చేసి ఆన్‌లైన్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## జూన్ 8 ప్రత్యేక గ్రామసభను విజయవంతం చేయాలి: డీఎల్‌పీవో సురేష్ బాబు



సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, జూన్ 6, ప్రతినిధి: మెదక్ జిల్లా బొడ్మట్‌పల్లి గ్రామంలో జూన్ 8న సోమవారం నిర్వహించనున్న ప్రత్యేక గ్రామసభను విజయవంతం చేయాలని డీఎల్‌పీవో సురేష్ బాబు గ్రామ ప్రజలకు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బొడ్మట్‌పల్లి గ్రామాన్ని సందర్శించిన ఆయన గ్రామ ప్రజలు, వార్డు సభ్యులు, మహిళా సంఘాలు, కుల సంఘాలు, యువజన సంఘాలు, యువకులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశమై గ్రామసభలో ప్రతి ఒక్కరూ పాల్గొని గ్రామాభివృద్ధికి సహకరించాలని కోరారు. అనంతరం గ్రామంలోని పల్లె ప్రకృతి వనం, డంపింగ్ యార్డ్, నర్సరీ, క్రిమిటోరియంను పరిశీలించి అక్కడి నిర్వహణపై వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తలారి అవినాష్ కుమార్, వార్డు సభ్యులు రవిశంకర్, శ్రీశైలం, కరీం, పంచాయతీ కార్యదర్శి రాందాస్, ధనుంజయ్ గౌడ్, ఘటం ఈశ్వరప్ప, పట్లోల్ల నరసప్ప, అందోల్ కిష్టయ్య, ముద్దపురం వీరప్ప, సాకలి గంగన్న, బేగరి దేవరాజు, భూపాల్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## అందరి సహకారంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యం



సందేశం టైమ్స్, సంగారెడ్డి, జూన్ 6, జిల్లా ఇంచార్జి కె. సంగమేశ్వర్: సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ కళాశాలలో ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని హరితహారం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు సహకారంతో కళాశాల ఎన్ఎస్ఎస్, ఎన్సీసీ విభాగాలు మరియు జిల్లా కాలుష్య నియంత్రణ బోర్డు సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టినట్లు కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జగదీశ్వర్, జిల్లా కాలుష్య నియంత్రణ బోర్డు అధికారి విజయలక్ష్మి సంయుక్త ప్రకటనలో తెలిపారు. భూమిపై పర్యావరణ సమతుల్యత కోసం కనీసం 33 శాతం వృక్ష సంపద అవసరమని, చెట్లు ప్రమాదకర విషవాయువులను గ్రహించి జీవరాశులకు అవసరమైన ఆక్సిజన్‌ను అందిస్తాయని పేర్కొన్నారు. మానవ అవసరాలకు కలపను అందించడంతో పాటు పశుపక్ష్యాదులకు ఆశ్రయంగా నిలుస్తాయని తెలిపారు. పట్టణీకరణ, నగరీకరణ పేరుతో వృక్ష సంపదను నాశనం చేయడం వల్ల కాలుష్యం పెరిగి అనేక ప్రమాదకర వ్యాధులు వ్యాపిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ సంవత్సరానికి కనీసం ఒక మొక్క నాటి దానిని సంరక్షిస్తే పర్యావరణ సమతుల్యత సాధ్యమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కాలుష్య నియంత్రణ బోర్డు రీజినల్ కార్యాలయ అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంట్ సైంటిస్ట్ పి. పద్మ మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి గాలి, నేల, నీటి కాలుష్యాలను నియంత్రించాలని సూచించారు. చెట్లను నాటి సంరక్షించడం ద్వారా మాత్రమే భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించగలమన్నారు. ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జగదీశ్వర్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, ఎన్సీసీ క్యాడెట్లు, జిల్లా కాలుష్య నియంత్రణ బోర్డు అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వర్షాకాలానికి ముందే ఎన్‌హెచ్-65పై భద్రతా చర్యలు పూర్తి చేయాలి: కలెక్టర్ ప్రతీక్ జైన్



సందేశం టైమ్స్, సంగారెడ్డి, జూన్ 6, జిల్లా ఇంచార్జి కె. సంగమేశ్వర్: జాతీయ రహదారి-65పై సంగారెడ్డి నుంచి పటాన్‌చెరు వరకు కొనసాగుతున్న రోడ్డు విస్తరణ, నిర్మాణ పనులను వర్షాకాలానికి ముందే పకడ్బందీగా పూర్తి చేసి ప్రజల భద్రతకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్‌తో కలిసి శుక్రవారం రహదారి నిర్మాణ పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్, వాటర్ లాగింగ్ పాయింట్లు, డ్రైనేజీ వ్యవస్థ, విద్యుత్ స్తంభాల తరలింపు, నీటి పైప్‌లైన్ల షిఫ్టింగ్, పారిశుద్ధ్య నిర్వహణ తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించారు. గత ఏడాది వర్షాకాలంలో ఎదురైన సమస్యలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు ప్రణాళికతో పనులు చేపట్టాలని సూచించారు. ప్రమాదాలకు ఆస్కారం ఉన్న బ్లాక్‌స్పాట్ల వద్ద తాత్కాలిక భద్రతా ఏర్పాట్లు చేయడంతో పాటు డ్రైనేజీలపై స్లాబులు ఏర్పాటు చేసి మూసివేయాలని జాతీయ రహదారి అధికారులను ఆదేశించారు. అవసరమైన చోట నీటి పైప్‌లైన్లను వెంటనే తరలించి ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. రోడ్డు విస్తరణకు అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాలను తక్షణమే తరలించాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. రహదారి విస్తరణకు ప్రభావితమవుతున్న నివాస భవనాల యజమానులకు పరిహారం చెల్లించి తొలగింపు ప్రక్రియను వేగవంతం చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారి పరిసర ప్రాంతాల్లో చెత్తాచెదారం పేరుకుపోకుండా మున్సిపల్ అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని, ప్రజల సౌకర్యం, భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. పెద్దాపూర్ పట్నం డాబా ఎదురుగా ఉన్న కల్వర్టును పరిశీలించిన కలెక్టర్, వర్షాకాలం సమీపిస్తున్నందున వెంట్లను శుభ్రపరిచి నీటి ప్రవాహానికి ఆటంకం లేకుండా చూడాలని ఇరిగేషన్ శాఖ అధికారులకు సూచించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, డీఎస్పీలు, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ రఘువీర్, ఆర్ అండ్ బీ అధికారులు, జాతీయ రహదారుల డీఈఈ రామకృష్ణ, ఈఈ శ్రవణ్ ప్రకాష్, జీఎం రమేష్, ఆర్‌కేసీపీఎల్ కాంట్రాక్టర్ జయప్రకాష్, సంగారెడ్డి, ఇస్నాపూర్ మున్సిపల్ కమిషనర్లు, ఆర్డీవోలు, తహసీల్దార్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## బర్డ్ వాక్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి: డీఎఫ్‌వో జోజీ ఐఎఫ్ఎస్



సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, జూన్ 6, ప్రతినిధి: ప్రకృతి పరిరక్షణ, పక్షుల సంరక్షణపై ప్రజల్లో అవగాహన పెంపొందించే లక్ష్యంతో నిర్వహిస్తున్న బర్డ్ వాక్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా అటవీ శాఖ అధికారి జోజి ఐఎఫ్ఎస్ పిలుపునిచ్చారు. పోచారం ల్యాండ్‌స్కేప్‌లోని పక్షి వైవిధ్యం, సహజ వారసత్వాన్ని ప్రజలకు పరిచయం చేయడానికి జూన్ 7న ఉదయం 6.30 గంటల నుంచి 8 గంటల వరకు పోచారం డీబీసీలో బర్డ్ వాక్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, అదనపు కలెక్టర్ నగేష్‌తో పాటు పలువురు జిల్లా అధికారులు పాల్గొననున్నారని పేర్కొన్నారు. పోచారం జలాశయం అభయారణ్యం పరిసర ప్రాంతం వలస నీటి పక్షులు, కొంగలు, ఐబిస్‌లు, బాతులు సహా అనేక రకాల పక్షి జాతులకు నిలయంగా ప్రసిద్ధి చెందిందని వివరించారు. ఇది రాష్ట్రంలో ముఖ్యమైన పక్షి వీక్షణ కేంద్రంగా గుర్తింపు పొందిందన్నారు. ప్రకృతి ప్రేమికులు, విద్యార్థులు, అధికారులు పాల్గొని వివిధ రకాల పక్షులను వీక్షించాలని కోరారు. పక్షుల జీవన విధానం, వలస పక్షుల ప్రాముఖ్యత, పర్యావరణ సమతుల్యతలో వాటి పాత్ర గురించి ప్రజలకు అవగాహన కల్పించడమే కార్యక్రమం ఉద్దేశమని తెలిపారు. పక్షుల సంరక్షణ కోసం ప్రతి ఒక్కరూ చెట్లు నాటడం, నీటి వనరులను కాపాడడం, పర్యావరణాన్ని పరిశుభ్రంగా ఉంచడం వంటి చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రకృతిని దగ్గరగా ఆస్వాదిస్తూ పర్యావరణ పరిరక్షణపై చైతన్యం పెంపొందించేందుకు బర్డ్ వాక్ వంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని జోజీ ఐఎఫ్ఎస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు పర్యావరణ పరిరక్షణకు బీజేపీ కృషి





సందేశం టైమ్స్, కాకినాడ, జూన్ 6, ప్రతినిధి: భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో కాకినాడలో ప్రజా సమస్యల పరిష్కారం, పర్యావరణ పరిరక్షణ లక్ష్యాలతో 'జనతా వారధి' కార్యక్రమంతో పాటు "అమ్మ పేరుతో – ఒక మొక్క" కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు పీవీఎన్ మాధవ్ ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జనతా వారధి కన్వీనర్, జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల సాహితీ వర్మ, కో-కన్వీనర్ పెండేం శ్రీదేవి, రాష్ట్ర సివిల్ సప్లై డైరెక్టర్ ఎనిమిరెడ్డి మాలకొండయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిక్కిన విశ్వేశ్వరరావు మాట్లాడుతూ ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు బీజేపీ ఎప్పటికప్పుడు ప్రజల్లో ఉంటూ పనిచేస్తోందన్నారు. అలాగే పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, గాలి, నీరు, భూమి, చెట్లను దైవ స్వరూపాలుగా భావించి సంరక్షించడం భారతీయ సంస్కృతిలో భాగమని పేర్కొన్నారు. సీనియర్ నాయకుడు దువ్వూరి సుబ్రహ్మణ్యాం మాట్లాడుతూ "అమ్మ జీవితాన్ని ఇస్తే ఆ జీవితాన్ని నిలబెట్టేది మొక్క మాత్రమే" అని పేర్కొంటూ బీజేపీ జాతీయ అధ్యక్షుడి పిలుపు మేరకు జిల్లా వ్యాప్తంగా 5 వేల మొక్కలు, కాకినాడ నగరంలో 300 మొక్కలు నాటే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. రాష్ట్ర సివిల్ సప్లై డైరెక్టర్ ఎనిమిరెడ్డి మాలకొండయ్య మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో చైతన్యం కల్పించడం అభినందనీయమన్నారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించడం కూడా ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతలను తగ్గించడానికి మొక్కలు నాటడం ఒక్కటే పరిష్కారమని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు కుండల సాయికుమార్ యాదవ్, చోడిశెట్టి రమేష్ బాబు, రాష్ట్ర మీడియా ఇంచార్జ్ యార్లగడ్డ రామ్ కుమార్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఘంటసాల గోవిందరాజులు, యువమోర్చా జిల్లా అధ్యక్షుడు పార్థసారథి, జిల్లా ట్రెజరర్ పైడా రవీంద్ర, జిల్లా ఉపాధ్యక్షుడు ముసలాగంటి సురేష్, గోడి సత్యవతి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# మాతంగి నాగరాజుకు నివాళులర్పించిన కాంగ్రెస్ నాయకులు



సందేశం టైమ్స్, చింతకాని, జూన్ 6, ప్రతినిధి: మధిర నియోజకవర్గంలోని చింతకాని గ్రామపంచాయతీ వార్డు సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ నాయకుడు మాతంగి నాగరాజు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో పలువురు కాంగ్రెస్ నాయకులు ఆయన భౌతికకాయానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, డీసీసీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్ చింతకాని చేరుకుని మాతంగి నాగరాజు భౌతికకాయానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కన్నెబోయిన గోపి యాదవ్, మత్కేపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటి వెంకటేశ్వరరావు, నన్నక శ్రీనివాసరావు, బందెల నాగార్జున, కొప్పుల గోవిందరావు, సర్పంచ్ కిలారు మనోహర్ బాబు, అబ్దుల్ నబీ, మధిర సోషల్ మీడియా కోఆర్డినేటర్ అనిల్ కుమార్ వేర్పుల, ఎస్సీ సెల్ అధ్యక్షుడు వనం చెన్నప్ప, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు చాట్ల చంద్రం, అబ్దుల్ మజీద్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి తెలంగాణలో ప్రభుత్వ డాక్టర్ల సమ్మె.. ఓపీ సేవలు బంద్



సందేశం టైమ్స్, హైదరాబాద్, జూన్ 6, ప్రతినిధి: తెలంగాణ వ్యాప్తంగా ప్రభుత్వ వైద్యులు నేటి నుంచి సమ్మె బాట పట్టడంతో ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఓపీ సేవలు నిలిచిపోయే పరిస్థితి నెలకొంది. తెలంగాణ ప్రభుత్వ వైద్యుల అసోసియేషన్ కీలక నిర్ణయం తీసుకుంటూ రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలకు పిలుపునిచ్చింది. నిబంధనలకు విరుద్ధంగా వైద్యుల బదిలీలు చేపట్టారని ఆరోపిస్తూ ప్రభుత్వం వెంటనే స్పందించి జీవో 38ను పటిష్ఠంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. వైద్యుల సంఘం నాయకుల ప్రకారం బదిలీల ప్రక్రియలో పారదర్శకత పాటించలేదని, సీనియారిటీ, సేవా నిబంధనలను విస్మరించి అన్యాయంగా బదిలీలు చేసినట్లు ఆరోపించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వానికి పలుమార్లు విజ్ఞప్తులు చేసినప్పటికీ సరైన స్పందన రాకపోవడంతో సమ్మెకు దిగినట్లు తెలిపారు. సమ్మెలో భాగంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఓపీ సేవలను బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. అత్యవసర వైద్య సేవలు మాత్రం కొనసాగించే అవకాశమున్నట్లు సమాచారం. రాష్ట్రవ్యాప్తంగా వైద్యుల ఆందోళనలతో ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే సాధారణ రోగులు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని తెలుస్తోంది. వైద్యుల సమస్యలను పరిష్కరించి ప్రజలకు వైద్య సేవల్లో అంతరాయం కలగకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ చేసిన బండారి గంగాధర్



సందేశం టైమ్స్, సంగారెడ్డి, జూన్ 6, జిల్లా ఇంచార్జి కె. సంగమేశ్వర్: మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గంలోని శివంపేట్ మండలం పిల్లుట్ల గ్రామంలో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన రూ.36 వేల చెక్కును మెదక్ జిల్లా అధికార ప్రతినిధి, కాంగ్రెస్ నాయకుడు బండారి గంగాధర్ లబ్ధిదారురాలు ముండ్రాతి మౌనికకు అందజేశారు. వైద్య చికిత్స ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం ఈ ఆర్థిక సహాయం అందించిందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా బండారి గంగాధర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి పేద ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా మారిందన్నారు. అనారోగ్యంతో ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న నిరుపేద కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ప్రభుత్వం అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధితులకు ఇది పెద్ద ఊరటనిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో బీజీఆర్ యువసేన అధ్యక్షుడు, కాంగ్రెస్ నాయకుడు కుమ్మరి నాగరాజు, పిల్లి నర్సింలు, బోస్ లింగం, కొత్తపల్లి నాగరాజు, పిల్లి సురేష్, పిల్లి నరేష్, రంగప్ప బాలరాజ్, ముండ్రాతి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# "ఒకటో తేదీ జీతాలు" హామీ ఏమైంది..? సర్పంచులు, అంగన్వాడీల్లో ఆందోళన




సందేశం టైమ్స్, హైదరాబాద్, జూన్ 6, ప్రతినిధి: ప్రతి నెల ఒకటో తేదీన ఉద్యోగులందరికీ జీతాలు చెల్లిస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలుపై ఇప్పుడు ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా గ్రామ పంచాయతీ సర్పంచులు, అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లకు నెలల తరబడి వేతనాలు అందకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా అసంతృప్తి నెలకొంది. ప్రభుత్వం ప్రకటించిన "ఒకటో తేదీకే జీతాలు" హామీ కేవలం ప్రకటనలకే పరిమితమైందా అనే చర్చ ఉద్యోగ, ప్రజాప్రతినిధి వర్గాల్లో మొదలైంది. రాష్ట్రంలోని 12,762 గ్రామపంచాయతీలకు చెందిన సర్పంచులు గత ఏడాది డిసెంబర్ 22న బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి గౌరవ వేతనాల చెల్లింపులో జాప్యం కొనసాగుతోందని సమాచారం. ఒక్కో సర్పంచికి నెలకు రూ.6,500 చొప్పున చెల్లించాల్సి ఉండగా, ఐదు నెలల బకాయిలు కలిపి సుమారు రూ.41.28 కోట్ల మేర పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. సర్పంచులతో పాటు కొంతమంది ఉపసర్పంచులు, గ్రామస్థాయి ప్రజాప్రతినిధులు కూడా నిధుల కొరతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెబుతున్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలు, పారిశుధ్య నిర్వహణ, వీధి దీపాల పర్యవేక్షణ, అభివృద్ధి పనులు, ప్రజా ఫిర్యాదుల పరిష్కారం వంటి బాధ్యతలు నిర్వర్తిస్తున్నప్పటికీ గౌరవ వేతనాలు సకాలంలో అందక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పలువురు సర్పంచులు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. కొంతమంది సర్పంచులు గ్రామ అవసరాల కోసం వ్యక్తిగతంగా అప్పులు చేసి ఖర్చు చేస్తున్న పరిస్థితి నెలకొన్నదని తెలుస్తోంది. మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న సుమారు 62 వేల మంది అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు కూడా గత రెండు నెలలుగా జీతాలు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు సమాచారం. కుటుంబ పోషణ, పిల్లల చదువులు, ఇంటి ఖర్చులు, వైద్య అవసరాలు, అప్పుల చెల్లింపులు నిర్వహించడంలో తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నామని వారు వాపోతున్నారు. చిన్నారుల పోషకాహారం, ప్రీ-స్కూల్ విద్య, గర్భిణులు, బాలింతలకు సేవలు అందిస్తున్న అంగన్వాడీ సిబ్బంది జీతాల ఆలస్యంతో మనోధైర్యం కోల్పోతున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల పలు ఉద్యోగ సంఘాలు, అంగన్వాడీ సంఘాల ప్రతినిధులు వేతనాల ఆలస్యంపై ప్రభుత్వ దృష్టికి సమస్యను తీసుకెళ్లినట్లు తెలిసింది. "ఒకటో తేదీ జీతాలు" హామీ ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రమేనా..? గౌరవ వేతనాలు పొందే సిబ్బంది, గ్రామస్థాయి ప్రజాప్రతినిధులకు వర్తించదా..? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. పెండింగ్‌లో ఉన్న గౌరవ వేతనాలు, జీతాలను వెంటనే విడుదల చేసి ప్రతి నెలా క్రమం తప్పకుండా చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని సర్పంచులు, అంగన్వాడీ సిబ్బంది ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# నూతన గృహప్రవేశానికి హాజరైన బండారి గంగాధర్



సందేశం టైమ్స్, సంగారెడ్డి, జూన్ 6, జిల్లా ఇంచార్జి కె. సంగమేశ్వర్: మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గంలోని శివంపేట్ మండలం లింగోజిగూడ తాండ గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు పథకం కింద నిర్మించిన నూతన గృహ ప్రవేశ కార్యక్రమానికి మెదక్ జిల్లా అధికార ప్రతినిధి, కాంగ్రెస్ నాయకుడు బండారి గంగాధర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ధీరావత్ విజయ, కాలేశ్వర్ దంపతులు రూ.5 లక్షల వ్యయంతో నిర్మించిన ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని రిబ్బన్ కటింగ్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బండారి గంగాధర్ మాట్లాడుతూ పేదలకు సొంతింటి కల నెరవేర్చాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి ఇందిరమ్మ ఇల్లు పథకాన్ని ప్రవేశపెట్టారని తెలిపారు. ప్రజా ప్రభుత్వంలో ఇళ్లు లేని ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో పేదలకు న్యాయం జరుగుతోందని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల కుటుంబ సభ్యులు ప్రభుత్వం, బండారి గంగాధర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దొంతి సత్యనారాయణ, బీజీఆర్ యువసేన అధ్యక్షుడు కుమ్మరి నాగరాజు, మెగావత్ హోబ్యా, బాబు నాయక్, ధీరావత్ చరణ్ నాయక్, రాజు నాయక్, మాలోత్ చిన్న, పిల్లి మణికంఠ, పెద్దపులి మహేష్ కత్తు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాల్లో పాల్గొన్న ఆవుల రాజిరెడ్డి



సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, జూన్ 6, ప్రతినిధి: నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి శివ్వంపేట మండలంలోని నవాబ్‌పేట గ్రామం, చిలిపిచెడు మండలంలోని గౌతపూర్ గ్రామాల్లో నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన గృహాల్లోకి ప్రవేశించిన లబ్ధిదారులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ఎంతో ఉపయోగకరంగా ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. అనంతరం లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకొని పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# జొన్నల కొనుగోళ్లు వేగవంతం చేయాలి: అదనపు కలెక్టర్ నగేష్



సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, జూన్ 6, ప్రతినిధి: జొన్నల కొనుగోళ్లు వేగవంతం చేయాలని, అలాగే వరి ధాన్యం అన్లోడింగ్ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం రామాయంపేట మండలంలోని వ్యవసాయ మార్కెట్ గోదాములను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జొన్నల కొనుగోళ్లలో ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. రైతుల ఖాతాల్లో చెల్లింపులు ఆలస్యం కాకుండా సకాలంలో జరగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వరి ధాన్యం అన్లోడింగ్ పనులు వేగవంతం చేయాలని, అవసరమైన లారీలను అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు కేంద్రాల్లో సమర్థవంతమైన నిర్వహణ ఉండాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# శీర్షిక: చివరి దశలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ.. 222 కేంద్రాలు మూసివేత, రూ.644.98 కోట్ల చెల్లింపులు



సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, జూన్ 6, ప్రతినిధి: జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ చివరి దశకు చేరుకుందని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 76,276 మంది రైతుల నుంచి 3,58,118.040 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు ఆమె వెల్లడించారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి 60,349 మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో మొత్తం రూ.644.98 కోట్లను జమ చేసినట్లు తెలిపారు. రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని దశలవారీగా మిల్లులకు తరలించి అన్లోడింగ్ ప్రక్రియ కూడా వేగంగా కొనసాగుతోందని పేర్కొన్నారు. జిల్లాలోని మొత్తం 222 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఇప్పటికే మూసివేసినట్లు స్పష్టం చేశారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ధాన్యం చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని భరోసా ఇచ్చారు. మిగిలిన ధాన్యం సేకరణ కోసం సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించినట్లు తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం రైతులకు చెల్లింపులు సకాలంలో జరుగుతున్నాయని, కొనుగోలు ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా నిర్వహిస్తున్నామని కలెక్టర్ వివరించారు.

## శీర్షిక: గ్రామీణ అభివృద్ధి శాఖ లక్ష్యాల సాధనపై ప్రత్యేక దృష్టి పెట్టాలి: కలెక్టర్ ప్రతిమా సింగ్




సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, జూన్ 6, ప్రతినిధి: గ్రామీణ అభివృద్ధి శాఖ 2026–2027 సంవత్సరానికి నిర్దేశించిన లక్ష్యాలను సమయానికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడుతూ శాఖ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న నూతన మహిళా సంఘాల నమోదు, శ్రీనిధి రుణాల మంజూరు, ధాన్యం కొనుగోలు ప్రక్రియ, ఇందిరా మహిళా చీరల పంపిణీ, గోదాముల నిర్వహణ, వ్యవసాయ ఉత్పత్తుల ప్రోత్సాహం, సోలార్ పంప్ సెట్లు, పెట్రోల్ బంకుల ఏర్పాటు, చేయూత పింఛన్ల పంపిణీ వంటి అన్ని కార్యక్రమాలను వేగవంతం చేసి నిర్దేశిత లక్ష్యాలను తప్పనిసరిగా సాధించాలని స్పష్టం చేశారు, అలాగే గ్రామీణ ప్రాంత అభివృద్ధి ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమమని, క్షేత్రస్థాయిలో అమలు మరింత సమర్థవంతంగా జరిగేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు, ప్రజలకు సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో చేరేలా ప్రతి శాఖ బాధ్యతగా పనిచేయాలని ఆమె ఆదేశించారు.



## ఆందోల్–జోగిపేట మున్సిపాలిటీలో సాధారణ సర్వసభ్య సమావేశం.. పట్టణ అభివృద్ధిపై విస్తృత చర్చ

సందేశం టైమ్స్, సంగారెడ్డి జిల్లా, అందోల్ మండల ప్రతినిధి, జూన్ 6: అందోల్–జోగిపేట మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం సాధారణ సర్వసభ్య సమావేశం మున్సిపల్ చైర్మన్ అధ్యక్షతన నిర్వహించారు, ఈ సమావేశంలో పట్టణ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, వీధి దీపాల ఏర్పాటు, మున్సిపల్ పన్నుల వసూళ్లు వంటి కీలక అంశాలపై విస్తృతంగా చర్చ జరిగింది, ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ పట్టణ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని సూచించారు, ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు, సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, కమిషనర్ తిరుపతి, ఏఈ శ్రీకాంత్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## పాలెం గ్రామం నుంచి తెలంగాణ రాజ్యాధికార పార్టీలో భారీ చేరికలు

సందేశం టైమ్స్, మహబూబ్‌నగర్ జిల్లా, కొత్తకోట మండలం, జూన్ 06, ప్రతినిధి: మహబూబ్‌నగర్ జిల్లా కొత్తకోట మండలంలోని పాలెం గ్రామానికి చెందిన పలువురు యువకులు, ప్రజా ప్రతినిధులు మరియు సామాజిక కార్యకర్తలు తెలంగాణ రాజ్యాధికార పార్టీ సిద్ధాంతాలు, ఆశయాలకు ఆకర్షితులై పార్టీ కండువా కప్పుకొని ఘనంగా పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ, తెలంగాణలో సామాజిక న్యాయం, సమాన హక్కులు మరియు బహుజన రాజ్యాధికార సాధనే లక్ష్యంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ పనిచేస్తోందని తెలిపారు. పార్టీ విధానాలు నచ్చి స్వచ్ఛందంగా పెద్ద ఎత్తున ప్రజలు పార్టీలో చేరడం సంతోషకరమని పేర్కొన్నారు. పార్టీలో చేరిన సభ్యులకు నాయకులు శుభాకాంక్షలు తెలియజేస్తూ గ్రామ స్థాయి నుంచి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. పాలెం గ్రామం నుంచి జరిగిన ఈ భారీ చేరికలు కొత్తకోట మండలంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీకి మరింత బలం చేకూర్చనున్నాయని అన్నారు.

## తడి–పొడి నుండి నాలుగు విభాగాల చెత్త సేకరణకు కొత్త నిబంధనలు

సందేశం టైమ్స్, అమరావతి, జూన్ 06, ప్రతినిధి: పంచాయతీలు మరియు పురపాలికల్లో ఘన వ్యర్థాల నిర్వహణలో కీలక మార్పులు చేస్తూ చెత్తను ఇకపై నాలుగు విభాగాలుగా వేరు చేసి సేకరించనున్నట్లు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటివరకు తడి, పొడి చెత్తగా వేరు చేసి సేకరిస్తుండగా, సుప్రీంకోర్టు మార్గదర్శకాల నేపథ్యంలో కొత్త విధానం అమల్లోకి రానుంది. తడి వ్యర్థాలు, పొడి వ్యర్థాలు, శానిటరీ వ్యర్థాలు, అలాగే ప్రత్యేక జాగ్రత్త అవసరమయ్యే హానికర వ్యర్థాలు అనే నాలుగు విభాగాలుగా చెత్తను వేరు చేయాల్సి ఉంటుంది. వాడిన డైపర్లు, శానిటరీ న్యాప్కిన్లు వంటి వాటిని ప్రత్యేకంగా చుట్టి నిర్దేశిత బుట్టల్లో వేయాలని అధికారులు సూచించారు. ఘన వ్యర్థాలను వీధుల్లో వేయడం, కాల్చడం లేదా పాతిపెట్టడం నిషేధించబడింది. ప్రతి వీధి వ్యాపారి తప్పనిసరిగా చెత్త బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని, నాలుగు రకాల బుట్టలు వినియోగంలో ఉండాలని మార్గదర్శకాలు స్పష్టం చేస్తున్నాయి. 100 మందికి పైగా హాజరయ్యే కార్యక్రమాలకు సంబంధిత అధికారులకు కనీసం మూడు రోజుల ముందుగా సమాచారం ఇవ్వాలని సూచించారు. అలాగే బయో మెడికల్ వ్యర్థాల నిర్వహణ–2016 నిబంధనల ప్రకారం వాటిని ప్రత్యేకంగా నిర్వహించాల్సి ఉంటుంది. పెద్ద గేటెడ్ కమ్యూనిటీలు, సంస్థలు, హాస్టళ్లు, మార్కెట్లు, హోటళ్లు, రెస్టారెంట్లు తప్పనిసరిగా ఈ నిబంధనలు పాటించాలని ఆదేశించారు. కుళ్లే వ్యర్థాలను ఇంట్లోనే కంపోస్ట్ చేయాలని, నిర్మాణ వ్యర్థాలు మరియు మొక్కల వ్యర్థాలను వేరుగా నిల్వ చేసి అధికారుల సూచనల మేరకు తరలించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది.

## సూర్యాపేట రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఉద్రిక్తత.. వట్టే జానయ్య యాదవ్ అరెస్టు అనంతరం అస్వస్థత





సందేశం టైమ్స్, సూర్యాపేట జిల్లా, జూన్ 06, ప్రతినిధి: సూర్యాపేట జిల్లా కేంద్రంలోని వివాదాస్పద 'వజ్ర టౌన్‌షిప్' భూముల అక్రమ రిజిస్ట్రేషన్లను నిరసిస్తూ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగిన వట్టే జానయ్య యాదవ్ను పోలీసులు అరెస్ట్ చేయడంతో జిల్లా కేంద్రంలో ఉద్రిక్తత నెలకొంది. ఉదయం 10 గంటల నుంచి భీకర నిరసన చేపట్టిన ఆయనను సాయంత్రం పోలీసులు బలవంతంగా అదుపులోకి తీసుకునే క్రమంలో తోపులాట చోటుచేసుకుంది. రోజంతా నిరసనలో పాల్గొనడంతో ఆయనకు బీపీ తగ్గి అస్వస్థతకు గురవగా, వెంటనే సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలింపు చర్యలు చేపట్టారు. ఈ ఘటనతో తెలంగాణ రాజ్యాధికార పార్టీ శ్రేణులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ ప్రభుత్వం, పోలీసుల తీరుపై విమర్శలు చేస్తున్నారు. ఘటన స్థానికంగా తీవ్ర సంచలనం రేపింది.



## కోట్ల విలువైన ప్రభుత్వ భూముల్లో పేదలకు ఇందిరమ్మ ఇండ్లు – మహిళలకు ప్రత్యేక వాటా

సందేశం టైమ్స్, హైదరాబాద్, జూన్ 06, ప్రతినిధి: కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములను పేదల సంక్షేమానికి వినియోగిస్తూ అల్ప ఆదాయ (ఎల్ఐజి), మధ్యతరగతి (ఎంఐజి) వర్గాలకు లక్ష ఇండ్ల నిర్మాణం చేపడతామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార & పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. క్యూర్ పరిధిలో పేదలు నివసిస్తున్న ప్రాంతాలకు సమీపంలోనే నియోజకవర్గాన్ని యూనిట్‌గా తీసుకొని ఇండ్ల నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఇందిరమ్మ గృహ నిర్మాణ కార్యక్రమంపై సచివాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించిన మంత్రి, 2026–27 ఆర్థిక సంవత్సరానికి క్యూర్ పరిధిలో లక్ష ఇండ్లు, ఇతర ప్రాంతాల్లో 2.50 లక్షలు కలిపి మొత్తం 3.50 లక్షల ఇండ్లకు పరిపాలన అనుమతులు ఇప్పటికే మంజూరైనట్లు పేర్కొన్నారు. గత ప్రభుత్వం పేదల ఉపాధి, జీవన పరిస్థితులను పట్టించుకోకుండా నగర శివార్లలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించిందని విమర్శించిన ఆయన, ఉపాధి దూరం కావడంతో అనేక ఇళ్లు ఖాళీగా మిగిలిపోయాయని తెలిపారు. ఈ తప్పిదాలను పునరావృతం చేయకుండా పేదలు నివసిస్తున్న ప్రాంతాల్లోనే గౌరవప్రద జీవితం అందించేలా గృహ నిర్మాణాన్ని చేపడతామని చెప్పారు. ముఖ్యంగా ఆ స్థలాల్లో మహిళలకు హక్కు కల్పించడం ద్వారా వారి ఆర్థిక, సామాజిక భద్రతను బలోపేతం చేస్తామని మంత్రి పేర్కొన్నారు. ఇంటి నిర్మాణం కనీసం 400 చదరపు అడుగులుగా ఉండేలా డిజైన్ చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి వి.పి. గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

## జనసేన పార్టీ రాజ్యసభ అభ్యర్థిగా లింగమనేని రమేష్ ఖరారు



సందేశం టైమ్స్, అమరావతి, జూన్ 06, ప్రతినిధి: జనసేన పార్టీ తరఫున రాజ్యసభ అభ్యర్థిగా శ్రీ లింగమనేని రమేష్ పేరును పార్టీ అధ్యక్షులు శ్రీ పవన్ కల్యాణ్ ఖరారు చేశారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం ఆయన అధికారికంగా రమేష్ పేరును ప్రకటించినట్లు సమాచారం. 2015 నుంచి శ్రీ రమేష్‌కు జనసేన పార్టీతో, అలాగే పవన్ కళ్యాణ్‌తో సన్నిహిత అనుబంధం ఉందని పార్టీ వర్గాలు తెలిపాయి. రాష్ట్ర అభివృద్ధి కోసం అన్ని సామాజిక వర్గాల మధ్య సఖ్యత అవసరమని, దానికి అనుగుణంగా సోషల్ ఇంజినీరింగ్ దిశగా పవన్ కళ్యాణ్ ఆలోచనలకు రమేష్ మద్దతు తెలిపినట్లు పేర్కొన్నారు. శనివారం మధ్యాహ్నం రాజ్యసభ అభ్యర్థిగా లింగమనేని రమేష్ నామినేషన్ దాఖలు చేయనున్నట్లు సమాచారం. 2019 ఎన్నికల్లో ప్రతికూల ఫలితాలు వచ్చినప్పటికీ పార్టీ సిద్ధాంతాలపై విశ్వాసం కోల్పోకుండా కొనసాగిన వారికి అవకాశాలు కల్పిస్తున్నామని, అదే సూత్రం ఈ ఎంపికలోనూ పాటించినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. జనసేన పార్టీ రాజకీయ కార్యదర్శి పి. హరిప్రసాద్ ఈ సమాచారం విడుదల చేసినట్లు తెలిసింది.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) – రిజిస్ట్రేషన్ నం :TGTEL/25/A0348, టైటిల్ కోడ్: Sandhesham Times,(పబ్లికేషన్: అమృత వెంకట్ మీడియా పబ్లికేషన్ ప్రైవేట్ లిమిటెడ్.) ప్రచురణ స్థలం: 3-82, వాయిల సింగారం గ్రామం, అనంతగిరి మండలం, సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త / publisher : కాసే అమృత, మొబైల్: 9052045435, ఈ-మెయిల్: sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్: www.sandeshamtimes.com, ముద్రణ స్థలం: సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press), 3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ – 522006.